క్లుప్తంగా

ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలి



ఆధ్యాత్మిక ప్రవచనాలు చెబుతున్న నికేతన్ స్వామి

సారవకోట: మానవులు ఈశ్వాద్వేషాలను విడనాడాలని నికేతన్ స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజ్ఞాన సమాజం ఆధ్వర్యంలో 85వ సత్సంగ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో బోధించిన ప్రతీ అంశం మానవ దైనందిన జీవితానికి ఉపయోగపడుతుందని, ప్రతిఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలన్నారు. రాంబాబు, అల్లు రామయ్య, సోమేశ్వరరావు, రామదాస్ తదితరులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. ఆనెం అప్పలస్వామి, జాడ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వెన్నెలవలస గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

సరుబుజ్జిలి: పులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అటవీ సెక్షన్ అధికారి ధర్మారావు తెలిపారు. వెన్నెలవలస, బసివానిగూడ, బొడ్లపాడు గ్రామాల్లో ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. బయటకు వెళ్లే సమయంలో ఎటువంటి ఆయుధాలు లేకుండా ఒంటరిగా ప్రయాణాలు చేయవద్దని తెలిపారు. ప్రజలంతా గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించారు. పోడు వ్యవసాయం కోసం వెళ్లే గిరిపుత్రులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బీట్ ఆఫీసర్ జకీర్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తసేకరణ బుట్టల పంపిణీ



చెత్తసేకరణ బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామంలో ఇంటింటికీ చెత్త సేకరణ బుట్టలు పంపిణీ చేశామని సర్పంచ్ ముద్దాడ మోహని ఆదివారం తెలిపారు. ఇంటిలో తడి, పొడి చెత్తను వేరువేరుగా బుట్టల్లో వేసి పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు అందజేయాలన్నారు. ఇంట్లోని చెత్తను తీసుకుని వచ్చి వీధుల్లో పడేయకూడదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దాడ లక్ష్మణరావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రావాడ సరోజిని, ఫీల్డ్ అసిస్టెంట్ రావాడ మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మహా అన్నప్రసాదం అందజేత



ఆహార పొట్లాలు అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

ఆమదాలవలస: మెట్టక్కివలసలో గల భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నార్థులకు (పేదలకు) స్థానిక రైల్వేస్టేషన్, మెట్టక్కివలస తదితర ప్రాంతాల్లో ఆదివారం అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యవర్గ సభ్యులు, భక్తులు డాక్టర్ పి.తాతయ్యలు, తమ్మన బంగారు రాజు, ఎ.గజపతిరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న గీతా మండలి సభ్యులు

నరసన్నపేట: శ్రావణ మాసంలో పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు ఉపదేశించిన భగవద్గీతను ఆదివారం బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పారాయణం చేశామని స్థానిక గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. గీతా మండలి సభ్యులు 29 మంది శ్రావణ మాసం సందర్భంగా పురాతన వేణుగోపాలస్వామి క్షేత్రాలకు వెళ్లి భగవద్గీతను పారాయణం చేయనున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ఆదివారం వేణుగోపాలస్వామి ఆలయంలో పారాయణం చేయడం జరిగిందన్నారు. వచ్చే సెప్టెంబర్ 10వ తేదీన టీ.లింగాలపాడులోని వేణుగోపాల స్వామి ఆలయంలో భగవద్గీత పారాయణం నిర్వహిస్తామన్నారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు. ఇప్పటివరకు మూడు ఆలయాల్లో పూర్తి చేశామన్నారు.

అర్హతే ప్రామాణికం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



పురుషోత్తంనగర్ కాలనీ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని పురుషోత్తంనగర్, రాజీవ్‌నగర్ కాలనీల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియకు ఆయా కాలనీ వాసులు సర్పంచ్ బూరల్లి శంకర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసి, బుక్‌లెట్‌లను అందించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం చేపట్టినప్పటి నుంచి నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం జరుగుతుందన్నారు. చెప్పిన తేదీకి చెప్పినట్లు పథకాలు అమలు చేస్తూ లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఇంటికీ లబ్ధి కలిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దీంట్లో భాగంగా టీడీపీతోపాటు జనసేన, ఇతర పార్టీల కుటుంబాలకు పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆదరించాలని కోరారు. నరసన్నపేట మేజరు పంచాయతీలో గడిచిన 15 రోజులుగా గడపగడపకు కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాబ్జి, పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, సురంగి నర్సింగరావు, పొట్నూరు సాయి ప్రసాద్, రఘుపాత్రుని శ్రీధర్, రావాడ మోహన్‌రావు, అవ్వ రవీంద్రనాథ్, అరవల అరవింద్, బొబ్బాది ఈశ్వరరావు, ఇత్రాజు సూరిబాబు, నేతింటి రాజ్వేరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం: ఈ నెల 28, 29 తేదీల్లో ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు హిరమండలం, కొత్తూరు మండలాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6, 7, 8వ తరగతులను బోధించే ఉపాధ్యాయులతోపాటు ఎస్‌జీటీలు విధిగా రెండు రోజులు నిర్వహించే శిక్షణకు హాజరుకావాలని కోరారు. తెలుగు సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు కొత్తూరు మండలం నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, హిందీ సబ్జెక్టుకు సంబంధించి కొత్తూరు మండలం మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశాలు ఉంటాయన్నారు. అలాగే ఇంగ్లిష్ సబ్జెక్టుకు మండలంలోని తంప ఉన్నత పాఠశాల, గణితం సబ్జెక్టుకు సంబంధించి కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సైన్స్ సబ్జెక్టుకు హిరమండలం మండలంలోని అవలంగి ఉన్నత పాఠశాల, సోషల్ సబ్జెక్టు హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఉంటాయన్నారు. ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలకు హాజరుకావాలని కోరారు.

డీపట్టా రద్దు చేసేంత వరకు సర్వే వద్దు



ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ రెవెన్యూ గ్రామంలోని సాగరం చెరువులో సుమారు 40 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంతో, మా గ్రామంతో సంబంధం లేని ఓ వ్యక్తికి సుమారు అరున్నర ఎకరాల డీపట్టా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ వ్యక్తి ఎప్పుడు మా ఊరు, భూమిని చూసేందుకు ఎప్పుడూ రాలేదు. సాగునీటి చెరువులో డీపట్టా ఇవ్వడం సరైన నిర్ణయం కాదని, డీపట్టా రద్దు చేయాలని డొంకలబడవంజ గ్రామానికి చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ను కోరారు. డీపట్టా రద్దు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసుకున్నామని ఫలితం లేకుండా పోయిందన్నారు. ఆయకట్టు రైతులకు సాగునీటికి ఇబ్బంది ఉందని, అధికారులు ఆ పట్టా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వేను వ్యతిరేకిస్తున్నట్లు సర్వే బృందాన్ని అడ్డుకున్నామని, ఆ సందర్భంగా తగిన చర్యలు తీసుకుంటామని, మాట ఇచ్చి పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టా రద్దుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు అభినందనలు



ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దువ్వాడ వాణి, నాయకులు



ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను అభినందిస్తున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు

పోలాకి: వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా మూడోసారి నియామకమైన మాజీ డిప్యూటీ సీఎం, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సారథ్యంలో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆయనను అభినందించటానికి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దువ్వాడ వాణి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావుతోపాటు పలువురు నాయకులు మబగాంలోని కృష్ణదాస్ క్యాంప్ కార్యాలయంలో ఆయనను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా రథసారథిగా కృష్ణదాస్ ఉంటే అందరికీ పార్టీ అందుబాటులో ఉన్నట్లుగా భావిస్తున్నామన్నారు. సోమవారం శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగే ప్రమాణ స్వీకారానికి కేడర్‌తో హాజరుకావాలని కృష్ణదాస్ ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులను కోరారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

- రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ సుబ్బారావు

శ్రీకాకుళం అర్బన్: రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రాంగణంలో 20 మందికి కుట్టు మిషన్లు, ట్రైనింగ్ పొందిన 70 మంది మహిళలకు శనివారం రాత్రి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3020 గవర్నర్ ఆర్.వి.సుబ్బారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు యెరుకోల మురళీమోహనరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గవర్నర్ సుబ్బారావు మాట్లాడారు. రోటరీ క్లబ్ ద్వారా పోలియో నిర్మూలన కోసం వేలాది కోట్ల రూపాయలను అందజేసినట్లు పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడు యెరుకోల మురళీమోహన్‌రావు కోరిక మేరకు ప్రసిద్ధ దేవాలయాలైన శ్రీకూర్మం, అరసవల్లి దేవస్థానాల్లో శాశ్వత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమోదిస్తున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది యెరుకోల మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ రోటరీక్లబ్ అని తెలిపారు. ఈ సంస్థ ప్రజలకు అనేక సేవా, సామాజిక కార్యక్రమాలు, శాశ్వత ప్రాజెక్టులు చేపడుతుందన్నారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నెల రోజుల్లోనే శ్రీకాకుళం నగరంలో గల ఏఎస్ఎన్ కాలనీలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ 500 మొక్కలు నాటడం జరిగిందన్నారు. విశాఖ–బి కాలనీలో గల షిర్డీ సాయిబాబా మందిరం వద్ద పిల్లలు, మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. డిస్ట్రిక్ట్ 3020లో అత్యధికంగా సభ్యులను చేర్పించడంలో కీలకపాత్ర పోషించడం జరిగిందన్నారు. మురళీమోహన్‌రావు, క్లబ్ గవర్నర్ సుబ్బారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, వరదా కొండబాబు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కె.టి.నాయుడు, కె.నాగేశ్వరరావు, సెక్రటరీ దుర్గారావు, తమ్మినేని వాసుదేవరావు, సభ్యులు పాల్గొన్నారు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించండి



మాట్లాడుతున్న పురుషోత్తం

నరసన్నపేట: మండలంలోని కేంద్రం నరసన్నపేటలో పట్టుశాలి సంఘ భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు, తహసీల్దార్‌కు కలవడానికి సంఘం తీర్మానించిందని సంఘం అధ్యక్షుడు పురుషోత్తం తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా అల్లం పురుషోత్తం, వైస్ ప్రెసిడెంట్‌గా గుంటుక శ్రీధర్, కార్యదర్శిగా దుంప సీతా రామరాజు, సహాయ కార్యదర్శిగా అల్లంశెట్టి రవికుమార్, బసవ సత్యవతి, కోశాధికారిగా అల్లం శెట్టి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మానసిక ఆందోళనకు గురికావద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణప్రసాద్

సరుబుజ్జిలి: విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లు, మానసిక ఆందోళనకు గురికాకుండా చదువుపట్ల ఏకాగ్రత పెంపొందించుకోవాలని స్థానిక ఎస్‌ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు. వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చిన్నారికి చేదోడు కార్యక్రమంపై బాలికలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాయి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ తాడేల రాజారావు, మండల కౌన్సిలర్ తాడేల సుధారాణి, వార్డెన్ పూర్ణిమ పాల్గొన్నారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

సారవకోట: ప్రతీ ఒక్క విద్యుత్ వినియోగదారుడు వారి విద్యుత్ కనెక్షన్ నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ రమేష్ సూచించారు. ప్రస్తుతం తమ సిబ్బంది ఆధార్ జిరాక్స్‌లను సేకరించి కార్యాలయంలో ఆధార్ అనుసంధానం చేస్తున్నామన్నారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణ ఉత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. నిజ శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను కల్యాణ మూర్తులుగా అలంకరించి అనివేటి మండపంలో వేంచేసింపజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు సాందీప్‌శర్మ కల్యాణాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం పూర్తి చేశారు.

బియ్యం, నిత్యావసర సరకుల అందజేత



బియ్యం బస్తాలను అందజేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

పొందూరు: విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలోని వావిలపలస గ్రామంలో రాహుల్ సౌరబ్ నిత్య అన్న దాన సత్రానికి పొందూరు ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు బియ్యం బస్తాలు, కూరగాయలను అందజేశారు. సత్రం నిర్వాహకుడు పాలూరి సిద్ధార్థకి పొందూరు పోలీసు స్టేషన్లో వీటిని అందించారు. సిద్ధార్థ చేస్తున్న సేవలకి తమ వంతు సహకారం అందించామన్నారు. నిత్యం పేదల ఆకలి తీర్చుతున్న సిద్ధార్థని అభినందించారు.

ఆక్రమణదారునికి నోటీసులు



పాతపట్నంలో నిబంధనలు అతిక్రమించి చేపట్టిన భవన నిర్మాణం

ఎల్.ఎన్.పేట (పాతపట్నం): పాతపట్నం మేజర్ పంచాయతీ అంతరాబ (అచ్యుతాపురం) గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 13/6, 3/1లో అక్రమ భవన నిర్మాణంతోపాటు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించినందున నోటీసులు జారీ చేసినట్లు ఈఓటి.కూర్మారావు ఆదివారం ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను 2019 జనవరిలో బిల్డర్ పొందారన్నారు. అక్రమ నిర్మాణంతోపాటు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిర్మాణ పనులు చేస్తున్నందున సంజాయిషీ కోరుతూ ఈ ఏడాది జూన్ 30వ తేదీన నోటీసులు జారీ చేశామన్నారు. బిల్డర్ ఇచ్చిన సంజాయిషీ సంతృప్తికరంగా లేనందున నోటీసులు జారీ చేశామన్నారు. అనుమతి కోరిన కంటే అదనంగా స్థలాలను అక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించామన్నారు. ఇచ్చిన అనుమతి కంటే పక్క స్థలాల్లో నిర్మాణం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారని తెలిపారు. భవన నిర్మాణ ప్లాన్‌లో చూపిన విధంగా కాకుండా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్లాన్‌లో చూపిన విధంగా గ్రౌండ్ ఫ్లోర్, రెండో ఫ్లోర్ నిర్మాణం చేయలేదన్నారు. చట్ట విరుద్ధంగా క్రయవిక్రయాలు జరిపారని వివరించారు. తూర్పు వైపున ఉన్న చెరువు గట్టుపై నడకతోవ సుమారు 341.89 చదరపు మీటర్లు అక్రమించి ప్రహరీ, అక్రమ భవన నిర్మాణం చేశారన్నారు. అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్న స్థలం కంటే అదనపు స్థలం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆక్రమణలు సొంత ఖర్చులతో తొలగించాలని సదరు బిల్డర్‌ను కోరామన్నారు. అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో పంచాయతీ అధికారులే తొలగించి, ఖర్చులు బిల్డర్ వద్ద నుంచి వసూలు చేయటం జరుగుతుందన్నారు.

సత్యసాయి సేవలు విస్తృతం చేయాలి



ఆహ్వానిస్తున్న జిల్లా సేవాదళ్ సమన్వయ కర్త రామచంద్రరావు

హిరమండలం: సత్యసాయి సేవలు మరింత విస్తృతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల సేవాదళ్ సమన్వయకర్త ఎస్.రామచంద్రరావు, మహిళా సన్వయకర్త అమ్మన్నమ్మ అన్నారు. స్థానిక ప్రేమ సాయి వృద్ధాశ్రమాన్ని ఆదివారం సందర్శించారు. సెప్టెంబర్ మూడో తేదీన శ్రీకాకుళం మున్సబ్‌పేట గాయత్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా సత్యసాయి సేవాదళ్ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి సభ్యులకు ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికలను అందజేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు, భజన మండలి సభ్యులు హజరుకావాలని కోరారు. బాబా వందో జయంతి నాటికి జిల్లాలో మరింతగా సేవలు విస్తృతం చేయాలని కోరారు. ప్రేమతో సేవ చేయడం ద్వారా భగవంతుని ఆశీస్సులు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ పప్పల అప్పలనాయుడు, సమితి కన్వీనర్ వెంకటరావు, ఆశ్రమ కో ఆర్డినేటర్ ఎ.సాయిబాబా, సభ్యులు చంటి మాస్టర్, కె.జయరాం, నరర్సింమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ప్రశాంతినగర్ రోడ్డును ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, నాయకులు

నరసన్నపేట: ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. నరసన్నపేటలోని ప్రశాంతినగర్‌లో రూ.4.30 లక్షలతో నిర్మించిన రోడ్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.5 లక్షలతో నిర్మించిన ప్రహరీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు నిధులు, సీఎండీఎఫ్ నిధులతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని పలువురు వక్తలు ఉద్బోధించారు. పట్టణంలోని కత్తెర వీధిలో గల అవతార్ మెహెర్‌బాబా కేంద్రం 62వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. పలు మెహెర్ కేంద్రాలకు చెందిన భక్తులు సంకీర్తనలు ఆలపించారు. సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. మచిలీపట్నంకు చెందిన మెహెర్ సుధాకర్, హైదరాబాద్‌కు చెందిన మెహెర్ వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు పి.వి.రంగప్రసాదరావు, ఆనంద్‌కుమార్, వి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాల పఠనం



భగద్గీత శ్లోకాలను పఠిస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ హరేరామ మందిరంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు భగద్గీత శ్లోక కంఠస్థ తరగతులను ఆదివారం నిర్వహించారు. పరాత్మానంద సరస్వతి స్వామీజీ భగద్గీతలోని నాల్గో అధ్యాయంలో గల జ్ఞాన కర్మ, సన్యాసయోగంలోని శ్లోకాలను చిన్నారులతో పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పారాయణం ద్వారా మనిషి ఎలా జీవించాలో తెలుస్తుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధి కె.వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.